

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# నేలరాలిన అరుణ తార

**ఇబ్రహీంపట్నం పోరాట యోధుడు కొండిగారి రాములు అస్తమయం**

**నిరుపేదల గొంతుకై ఉద్యమ బాట**

**రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా..సామాన్య జీవితం**

**52 భూ పోరాట కేసుల్లో జైలు శిక్ష**

**కుమారుడికి వైద్యం కూడా చేయించలేని పేదరికం**

**అయినా కడవరకూ నిజాయితీని వదలని వైనం**



మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు (ఫైల్ ఫోటో)

**ఇబ్రహీంపట్నం, మార్చి 13, ప్రభాతవార్త :** ఉద్యమాల గడ్డపై ఎర్రజెండాను రెపరెపలాడించిన ధీశాలి, అణగారిన వర్గాల అలుపెరగని పోరాట యోధుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు ఇక లేరు. గత కొంతకాలంగా వయోభారంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొండిగారి రాములు శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. తొమ్మిది నెలల క్రితం అయన సతీమణి ముత్యాలమ్మ కూడ మృతిచెందింది. కొండిగారి రాములు మరణవార్త తెలియగానే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా విషాద ఛాయలు అలముకున్నాయి. సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి, శాసనసభలో పేదల గొంతుకగా మారిన కొండిగారి రాములు మరణం వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటును మిగిల్చింది. ఆయన మృతికి రాజకీయాలకతీతంగా పలువురు ప్రముఖులు కన్నీటి నివాళులర్పించారు.

**ఆరుట్ల భూపోరాటంలో రాటుదేలిన విప్లవ వీరుడు**

కొండిగారి రాములు ప్రస్థానం పూలపాన్పు కాదు, అది ముళ్లబాటల పోరాట యాత్ర. ఆయన స్వగ్రామం ఆరుట్లలో 1967లో ప్రారంభమైన చారిత్రాత్మక భూపోరాటంలో కొండిగారి రాములు అత్యంత కీలక పాత్ర పోషించారు. సాయుధ పోరాట యోధులు కృష్ణమూర్తి నాయకత్వంలో శిక్షణ పొంది అణచివేతకు వ్యతిరేకంగా అడుగులు వేశారు. నాడు దున్నేవానికే భూమి దక్కాలన్న నినాదంతో భూస్వాములకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. 1985 నుంచి 1988 వరకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నేతగా వేలాది మంది కూలీలను ఏకం చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. భూపోరాటాల నేపథ్యంలో 1989 నుంచి 2007 వరకు కొండిగారి రాములు పై ఏకంగా 52 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎన్నిసార్లు జైలుకు వెళ్లినా నిరుపేదల సొంత ఇంటి కల కోసం ఆయన ఎన్నడూ వెనకడుగు వేయలేదు.

అసెంబ్లీ లోపల.. బయట.. అణగారిన వర్గాల గొంతుక

1989లో వామపక్ష అగ్రనేతలు కామ్రేడ్ పాషా, నరహరిల హత్య ఉదాంతంతో నియోజకవర్గం అట్టుడుకుతున్న తరుణంలో పార్టీ బాధ్యతలను భుజాన వేసుకున్న కొండిగారి రాములు అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించారు. అనంతరం 1994లోనూ రెండోసారి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. శాసనసభ లోపల ప్రజా సమస్యలపై గళమెత్తడమే కాకుండా, బయట కూడా ఉధృతమైన ఆందోళనలు చేపట్టారు. ముఖ్యంగా గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారం కోసం వందలాది గొర్రెలతో అసెంబ్లీ ముట్టడికి యత్నించి, రాస్తారోకోలు నిర్వహించి పాలకుల నిద్రపోగొట్టారు. నియోజక వర్గంలోని పల్లెపల్లెకూ లింకు రోడ్ల నిర్మాణానికి ఆయన చేసిన కృషి నేటికి అజరామరం.

**నిరుపేద ఎమ్మెల్యే.. నిలువెత్తు నిజాయితీ**

నేటి కాలంలో ఒకసారి పదవి దక్కితే చాలు తరతరాలకు సరిపడా ఆస్తులు కూడబెట్టుకుంటున్న నాయకులకు కొండిగారి రాములు ఒక నిలువు టద్దంలాంటి వారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా ఆయన ఒక పైసా కూడా వెనకేయలేదు. తన చివరి శ్వాస వరకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ డబ్బులతోనే పరమ సామాన్య జీవితాన్ని గడిపారు. తన కుమారుడికి కనీసం మెరుగైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోయినా, ప్రజా ఆశయాల కంటే ఆస్తులు ముఖ్యం కాదని నమ్మిన గొప్ప నీతిమంతుడు కొండిగారి రాములు. ప్రజలే తన ఆస్తిగా, వారి శ్రేయస్సే తన లక్ష్యంగా తుదిశ్వాస వరకు కమ్యూనిజం వైపే నిలబడ్డారు.కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన చిన్న కుమారుడు కిండిగారి త్రిలోక్‌కు బిఆర్ఎస్ మాజి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ సీటును ఇచ్చిన తన భుజాలపై వేసుకొని గెలిపించుకున్నారు.

**నేతల దిగ్భ్రాంతి..**

కొండిగారి రాములు మృతి పట్ల సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి. యాదయ్య, రైతు సంఘం నాయకులు పి. జంగారెడ్డి తదితరులు మిగతా 2లో

## పాషపూర్ అంగన్‌వాడి టీచర్‌కు మెమో

**విధుల్లో నిర్లక్ష్యంపై సిడిపిఓ సీరియస్ - 'వార్త' కు స్పందన**

**పెద్దేముల్, మార్చి 13, ప్రభాతవార్త:** అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు విధుల్లో నిర్లక్ష్యం వహించడం పట్ల ఐసిడిఎస్ సిడిపిఓ కాంతారావు సీరియస్ అయ్యారు. పర్యవేక్షణ లోపం- అంగన్‌వాడీల ఇష్టారాజ్యం శీర్షికన వార్త దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం పెద్దేముల్ మండలం పాషపూర్ అంగన్‌వాడి పాఠశాలను సూపర్ వైజర్ సునీత తనిఖీ చేశారు. స్థానికంగా విచారణ చేసిన అనంతరం ఆమె ఇచ్చిన నివేదిక ఆధారంగా పాషపూర్ అంగన్‌వాడి టీచర్ సరస్వతికి సిడిపిఓ మెమో జారీ చేశారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు ఎందుకు గైర్హా జర్ అయ్యారో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని వివరణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు సమయ పాలన పాటించాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# స్వయం సహాయక సంఘాలకు దారుణాలు



ఎస్.బి.ఐ ముందు ఆందోళన చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

**తీర్మానాలు లేకుండానే సంతకాలు ఫోర్జరీ చేశారు**

**బ్యాంకులో సంఘాల పేరుతో రుణాలు తీసుకుని లక్షల్లో స్వాహా**

**మరికల్ విఓఏపై మహిళా సంఘం సభ్యుల ఆరోపణ**

**తక్షణం విచారణకు ఆదేశాలివ్వాలని డిమాండ్**

**మరికల్ ఎస్‌బిఐ ఎదుట నిరసన**

**పరారీలో గ్రామ సంఘ సహాయకుడు**

**పరిగి, మార్చి 13, ప్రభాతవార్త :** గ్రామాలలో స్వయం సహాయక సంఘాల విఓఏ (గ్రామ సంఘ సహాయకులు)లు అమాయక మహిళలకు దా'రుణాలు' పంచుతున్నారు. రికార్డుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన వారే నిరక్షరాస్యులైన మహిళల పేరుతో లక్షల్లో రుణాలను తీసుకొని జేబు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మహిళా సంఘాల సభ్యులకు తెలియాకుండా వారి ఒక్కో గ్రూపు నుండి రూ.లక్షల్లో నిధులు స్వాహా జరిగిన ఉదంతం వెలుగు చూడటంతో వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలం మరికల్ గ్రామంలోని ఎస్.బి.ఐ. బ్యాంకు ఎదుట మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చేపట్టారు. ఇక్కడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాదాపు 80 వరకు స్వయం సహాయక సంఘాల ఖాతాలు ఉన్నాయి. ఈ సంఘాల బాధ్యత పర్యవేక్షించే విఓఏ గత 15 ఏళ్ల నుంచి సభ్యులకు రుణాల మంజూరు వ్యవహారం చూస్తున్నారు. ఖాళీ తీర్మానాలపై సభ్యుల సంతకాలు సేకరించి.. వారి ప్రమేయం లేకుండానే బ్యాంకు నుండి రుణానికి దరఖాస్తు చేయించి ఆ మొత్తంలో కొంత తమకు ఇచ్చి మిగతాది స్వాహా చేశారని వివరించారు. ఇంతే రుణం మంజూరైందని చెప్పేవాడని వాపోయారు. రికార్డులు తన దగ్గరే భద్రపరుచు కుంటూ, ఆర్థిక లావాదేవీలు చేస్తూ అనుమానం రాకుండా వ్యవహరించాడని ఆరోపించారు. నేరుగా విఓఏ నే బ్యాంకు నుండి నగదును పొందే వాడని .. ఇన్నాళ్లు మోసపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు విఓఏ పై విచారణ చేపట్టి , చర్యలు తీసుకోవాలని కోరారు. పరిగి నియోజక వర్గంలో దాదాపు ఐదు వేలకు పైగా మహిళా స్వయం సహాయక సంఘాలున్నాయి. సంఘాల నిర్వహణలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర కీలకం. సంఘాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ, ఆర్థిక లావాదేవిలు, రుణాల వసూలు, అవగాహన వంటి కార్యక్రమాలు విఓఏల వ్యవస్థ చేయాల్సి ఉంటుంది. పరిగి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మరికొందరు విఓఏలపై కూడా ఈ ఆరోపణలున్నాయి. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే విఓఏలు అక్రమాలకు పాల్పడుతు న్నారని సంఘాల సభ్యులు మండిపడుతున్నారు. ఫలితంగా స్త్రీ నిధి, బ్యాంకు

**రెండు రోజుల్లో విచారణ పూర్తి చేస్తాం**

**ఎస్‌బిఐ బ్రాంచి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలకృష్ణ**

మరికల్ గ్రామంలో విఓఏ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రెండు రోజుల్లో పూర్తిస్థాయి విచారణ చేపడతాం. గ్రామ సమాఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. 80 మహిళా సంఘాల సభ్యులతో వివరాలు సేకరిస్తాం. సమగ్ర విచారణ అనంతరం, పైఅధికారులకు నివేదిక అందిస్తాం.

## ఎర్రటి ఎండలో విద్యార్థినులతో వాచ్‌మెన్ డ్యూటీ!

**ఇబ్రహీంపట్నం ఉన్నత పాఠశాల సిబ్బంది నిర్వాకం**

**ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రుల ఆందోళన**



పాఠశాలకు వచ్చేవెళ్లే వారికి గేటు తీస్తున్న విద్యార్థిని

**ఇబ్రహీంపట్నం, మార్చి 13, ప్రభాతవార్త :** చదువుకోవాల్సిన విద్యార్థినులు గేటు వద్ద కాపలాదారులుగా మారారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఉదంతం స్థానికంగా చర్చనీయాంసమైంది. ఎర్రటి ఎండ అని చూడకుండా విద్యార్థినులకు వాచ్‌మెన్ బాధ్యతలు అప్పగించం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలకు వచ్చిపోయే వారి కోసం గేటు తీయడం, వేయడం వంటి పనులను బాలికలే నిర్వహిస్తున్నారని.. ఒకవైపు ఎండ తీవ్రతతో సామాన్యులే అల్లాడుతుంటే, బాలికలను ఇలా ఎండలో నిలబెట్టడం ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం గేటు కాపలానే కాకుండా, పదో తరగతి పరీక్షల షెడ్యూలు పత్రాలను గోడలకు అతికించే పనులను కూడా బాలికలతోనే చేయిస్తున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత కల్పించాల్సింది పోయి ఇలాంటి పనులకు వినియోగించడం దారుణమని మండిపడుతున్నారు.

## నూతన ఆలోచనలతో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

విద్యార్థులకు మంత్రి వివేక్ ఉద్బోధ 2

## అవినీతి ఉండద్దనే ఉమ్మడి చెక్ పవర్

**రద్దు చేసే అధికారం ఎవరికీ లేదు**

**క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం**

**కొత్తూరు మండల ఉప సర్పంచ్‌ల డిమాండ్**

**కొత్తూరు, మార్చి 13, ప్రభాతవార్త;** ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేయాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఉప సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని పాపిరోస్ పోర్ట్ రిసార్ట్‌లో నిర్వహించిన మీడియా సమా వేశంలో కొత్తూరు మండలం ఉప సర్పంచ్లు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, గ్రామ పంచాయతీ వ్యవస్థలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ఇద్దరికీ సమాన హక్కులు బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. అప్పటి ప్రభు త్వం అవినీతి ఉండవద్దనే ఉమ్మడి చెక్ పవర్ ఇచ్చింది. ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది ఉప సర్పంచ్‌ల హక్కులను దెబ్బతీసే చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండాలంటే చెక్ పవర్ అవసరమని అన్నారు. కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉప సర్పంచ్‌ల అధికారాలను తగ్గించే ప్రయత్నం చేయడం సరికాదని, అలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వెంటనే సర్పంచ్‌ల సంఘం నాయకులు ఇచ్చిన పిర్యాదును వెనక్కి తీసుకుని ఉప సర్పంచ్‌లందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఏకమై ఈ విషయంపై చర్చించి తగిన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు ఉపసర్పంచ్ శంతన్ రెడ్డి, సున్నాల గణేష్, ఎండి సిరాజ్, ఆరోగ్యం, వెంకటమ్మ, స్వరూప, స్వప్న రాందాస్, హనుమంత్ నాయక్, డోపాలా యాదయ్య, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపసర్పంచ్‌లు

## వైద్య పరీక్షల పేరుతో పేదలను దోచుకోవద్దు

**వైద్యులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** పేదవాడిని దోచుకోకండి.. తప్పుడు రిపోర్టులు ఇవ్వకండి.. సమాజం కోసం బాధ్యతగా పనిచేయండి.. మీ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసుకోండి.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు.షాద్ నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో బుగ్గారెడ్డి ఆసుపత్రి, తెలంగాణ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ల (టిడిఏ) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు తమ ఆశలు తగ్గించుకొని సామాన్యులకు వీలైనంత తక్కువ ధరకు వైద్యం అందించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లు గతంలో తప్పుడు రిపోర్టు ఇచ్చిన కారణంగా ఒక చిన్నారి మరణించడం జరిగిందని, అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. వైద్యులను రోగులు రెండో దైవంగా భావిస్తారని, అలాంటి రోగుల విషయంలో డబ్బులకు కక్కుర్తి పడకుండా కొన్నిసార్లు శివ భావంతో పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. కొన్ని కార్పొరేట్ హాస్పిటల్లో చనిపోయాక కూడా బ్రతికున్నాడని ఆశపెట్టి డబ్బులు వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి స్థాయికి దిగజార వద్దని సూచించారు. ఇంత కష్టపడి మిగతా 2లో





మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

# పది పరీక్షలకు అంతా సిద్ధం

**నేటి నుంచి ఏప్రిల్ 16 వరకూ..**

**హాజరు కానున్న 57,793 మంది విద్యార్థులు**

**జిల్లాలో 255 పరీక్షా కేంద్రాలు**

**సామగ్రి పంపిణీ కోసం 14 స్టేషనరీ పాయింట్లు**

**10 మంది రూట్ అధికారుల నియామకం**

**పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు**

**కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**

**రంగారెడ్డి అర్బన్, మార్చి 13, ప్రభాతవార్త:** జిల్లాలో నిర్వహించనున్న ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏడాది ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16, 2026 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు సుశీంద్రరావు తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 1024 ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 53,058 మంది రెగ్యులర్ అభ్యర్థులు, గతంలో విఫలమైన 1,103 మంది అభ్యర్థులు, అలాగే 3,632 మంది వొకేషనల్ అభ్యర్థులు ఉన్నారు. ఈ మేరకు జిల్లాలో విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అవసరమైన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 255 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో రెగ్యులర్, ప్రైవేట్ అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాల భద్రత కోసం 7 పోలీస్ స్టేషన్లను నిల్వ కేంద్రాలుగా గుర్తించారు. అదేవిధంగా సమాధాన పుస్తకాలు, ఇతర పరీక్షా సామగ్రి పంపిణీ కోసం 14 స్టేషనరీ పాయింట్లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను భద్రతా ప్రమాణాలు, సౌకర్యాల ఆధారంగా ఎ కేటగిరీ 47 కేంద్రాలు, బి కేటగిరీ 201 కేంద్రాలు, సి కేటగిరీ 7 కేంద్రాలుగా వర్గీకరించారు. ఈ కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, జెడ్పీ పాఠశాలలు తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల పర్యవేక్షణను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాను 10 రూట్లుగా విభజించి రూట్ అధికారులను నియమించారు. ప్రతి రూట్ అధికారి తన పరిధిలోని పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తూ పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశాన్ని పరిశీలిస్తారు. అలాగే పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయింది. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, స్టేషన్ కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ బృందాలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ నియమావళి అమలును పరిశీలించనున్నాయి. అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల సమయంలో కేంద్రాలలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖతో కూడా సమన్వయం కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ స్కూల్‌లో జిల్లా బల్క్ నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని 24 గంటల భద్రతతో భద్రపరచనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షా సామగ్రి భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు వెల్లడించారు.



మాడ్గులలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

**మేడ్చల్ జిల్లాలో 237 పరీక్షా కేంద్రాలు**

**అన్ని ఏర్పాట్లూ చేశాం**

**జిల్లా విద్యా అధికారి విజయకుమారి** 2



ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో ఉన్న ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్ గుల్షన్ బ్రదర్స్, ఎం.ఎస్ శ్రీ లక్ష్మి నారాయణ ఏజెన్సీస్ ఎరువుల దుకాణాలను సందర్శించి అక్కడ ఎరువుల విక్రయ విధానం, నిల్వలు, రికార్డులను పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న యూరియా, డి.ఏ.పీ, పొటాష్ తదితర ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారా, సరైన బిల్లులు ఇస్తున్నారా అనే విషయాలను తనిఖీ చేశారు. దుకాణదారులు స్టాక్ రిజిస్టర్, విక్రయాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులను సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు సరిపడా నిల్వ ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో భాగంగా ఎరువుల విక్రయం ఈ పాస్ యంత్రం ద్వారా జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఎరువుల బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి సంబంధిత రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల వాస్తవ నిల్వలను కూడా పరిశీలించి రికార్డులతో సరిపోల్చి తనిఖీ చేశారు. అదేవిధంగా పురుగు మందుల విక్రయానికి సంబంధించిన లైసెన్సులు, సంబంధిత ధృవ పత్రాలు పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, ప్రతి విక్రయాన్ని తప్పనిసరిగా ఈపాస్ యంత్రంలో నమోదు చేయాలని దుకాణదారులకు సూచించారు. సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## గ్యాస్‌ను బ్లాక్ చేస్తే కేసులు నమోదు: కలెక్టర్ దీపక్

**వికారాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వందతులను కూడా నమ్మవద్దని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గ్యాస్ నిల్వలు, సరఫరాపై ఎల్పీజీ డీలర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యుద్ధం ప్రభావం వలన జిల్లాలో ఎలాంటి ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ఇంతకు ముందు గ్యాస్ బుక్ చేసుకున్నా తరువాత సరఫరా ఉన్నట్లే ప్రస్తుతం కూడా గ్యాస్ సరఫరా యధావిధిగా ఉంటుందన్నారు. జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, గృహ అవసరాలకు వినియో గించే ఎల్.పి.జి గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ఆసు పత్రులు, విద్యా సంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు గ్యాస్ పై వస్తున్న అవాస్తవాలను, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. అర్బన్ ప్రాంతాలకు చెందిన వారు 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒక సారి చొప్పున గ్యాస్ బుక్ చేసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్యాస్ బ్లాక్ మార్కెట్ కు తరలించినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదేని సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినట్లయితే తనకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డీవో వాసు చంద్ర, డిసిఎస్ఓ సుదర్శన్, డీఎంసిఎస్ మురళి కృష్ణ, డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, డిఇఓ రేణుకాదేవి, డిబిసిడిఓ మాధవ రెడ్డి, డీఏఓ రాజారత్నం, డిడబ్ల్యుఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్ సరఫరా సక్రమంగా జరగాలి**

జిల్లాలో గృహ వినియోగ ఎచ్‌పి గ్యాస్ సరఫరా విధానం సక్రమంగా జరగాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలు, పంపిణీ విధానం, బుకింగ్ ప్రక్రియ, వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను కలెక్టర్ పరిశీలించారు. గ్యాస్ బుకింగ్ నుండి డెలివరీ వరకు నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు.



గ్యాస్ ఏజెన్సీలో నిల్వ వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్



చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

## కవయిత్రి మొల్ల రచనలు స్ఫూర్తిదాయకం

**ధారూర్ , మార్చి 13, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో ప్రముఖ కవయిత్రి కుమ్మరి మొల్ల మాంబ జయంతి వేడుకలను గ్రామస్థులు, నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ, తెలుగు సాహితీవనంలో మొల్లమాంబ ఒక ధ్రువ తార అని, ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగువారికి గర్వకారణమని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి, పట్టుదలతో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె రచనలు సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో కుమ్మరి రాము, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్, రాముగౌడ్, మల్లేష్, అశోక్, లక్ష్మీ మ్మనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పరీక్షల పేరుతో దోచుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

చదివిన వైద్యులు సమాజానికి ఉపయోగపడాలని ఆయన సూచించారు. డాక్టర్ అనురాగరెడ్డి తాత బుగ్గారెడ్డి ఈ రోజున లేకపోయినా ఆయన పేరుమీద ఇక్కడ ఓ ఆసుపత్రి ఉందని గుర్తు చేశారు. ఆసుపత్రి సమాజానికి ఉపయోగపడేలా, తాతకు పేరు తెచ్చేలా ఉండాలని అన్నారు. అదేవిధంగా ల్యాబ్ టెక్నిక్ అసోసియేషన్ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అనవసరమైన టెస్టులతో సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. డబ్బుఎలాగైనా సంపాదించ వచ్చని, కానీ రాష్ట్రపతిగా ఉండి కూడా రూపాయి సంపాదించుకొని అబ్దుల్ కలాంకు, అడ్డగోలుగా దేశాన్ని కొల్లగొడు తున్న ఆదాని ,అంబానీలకు తేడా ఉంటుందని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం, గాంధీ, నెహ్రూ లాంటి మహనీయులను మనం ఎందుకు గౌరవిస్తామో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు.

**తప్పుడు రిపోర్టులు ఇవ్వద్దు**
**డాక్టర్ విజయలక్ష్మి**

ల్యాబ్ టెక్నీషియన్ పై ఎంతో గురుదరమైన బాధ్యత ఉంటుందని దయచేసి వారు తప్పుడు రిపోర్టులు ఇవ్వొద్దని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి హితవు పలికారు. కొంతమంది లాప్ టెక్నీషియన్లు అనుభవలేమితో పేషంట్లకు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని దీనివల్ల తప్పుడు వైద్యం వారికి అందుతుందని దానివల్ల ప్రాణాపాయ పరిస్థితి వస్తుందని అన్నారు. చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

**ప్రాణాలతో చెలగాటం వద్దు**
**మున్సిపల్ చైర్మన్ బస్వం**

ల్యాబ్ టెక్నీషియన్ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడకూడదని మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ తెలిపారు. అందరూ కలిసికట్టుగా నాణ్యమైన సేవలు అందించాలని తప్పుడు రిపోర్టుల వల్ల ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుందని తెలిపారు. మున్సిపాలిటీ నుండి అసోసియేషన్ కోసం తమ వంతు సహకారం ఎల్లవేళలా అందుతుందని తెలిపారు.

**శభాష్ లక్ష్మణ్..**

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ తనకంటే, అందరికంటే గొప్ప వ్యక్తి ఇక్కడ ఉన్న వాళ్ళలో యువసత్తా లక్ష్మణ్ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ చేసే పనిలో తమ స్వార్థం చూసుకుంటారని, కానీ ఎలాంటి స్వార్థం లేకుండా రక్తదానం చేస్తూ ప్రాణాలు కాపాడుతూ జనం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నాడని అభినందించారు. అదే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్, పోలీసు శాఖ, జర్నలిస్టులు చేసే సేవలకు వెలకట్టలేమని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. మంచి మార్గంలో, నిజాయితీగా ముందుకు వెళ్లే వారికి తాను పూర్తిస్థాయిలో అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి



**వికారాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా సన్న బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా చేరేలా చూడాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణం లోని చౌక ధరల పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ షాప్‌లో బియ్యం, చక్కెర, తదితర అవసరమైన సరుకుల నిల్వలను పరిశీలించారు. సరుకులు లబ్ధిదారులకు సమయానికి అందుతున్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వేయింగ్ మిషన్ లో కొలతలు పరిశీలించారు.

ఇప్పటి వరకు ఎంత స్టాక్ వచ్చింది, ఎంత వరకు పంపిణి జరిగింది, ఇంకా ఎంత మిగిలి ఉన్నది ఎంత అనే పూర్తి వివరాలు డీలర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. సరుకుల బరువు విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి మ్మనారాయణ,డిఎంసిఎస్ మురళి కృష్ణ, డిఎస్ఓ సుదర్శన్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

## వేద విద్యార్థుల సంఖ్య పెరగాలి

**కీసర, మార్చి13, ప్రభాతవార్త:** కీసరగుట్టలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠాన్ని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం సందర్శించారు. ఆలయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. 1981 నుంచి నడుస్తున్న ఈ వేద విద్యా పీఠంలో ప్రస్తుతం 132 మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్ అవధానికి బీఆర్ నాయుడు సూచించారు.



కీసరగుట్టలోని వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించిన తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు

## గాలికుంటు వ్యాధితో భారీ ముప్పు

**పెద్దేముల్, మార్చి 13, ప్రభాతవార్త:** గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేయడం వల్ల పశువుల శరీరంలో వ్యాధిని ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మండల పశువైద్యాధికారి శ్రీదీప్తి తెలిపారు. శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదీప్తి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పాడి పశువులలో పాల దిగుబడి 50 నుంచి 80 శాతం తగ్గిపోతుందన్నారు. టీకా వేయ డం వల్ల ఈ నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. పశువుల్లో సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. పెద్ద పశువుల కంటే చిన్న దూడలపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇది గుండె కండరాలను దెబ్బతీసి దూడల ఆకాల మరణానికి దారితీస్తుందని వివరించారు. టీకా ద్వారా వాటిని కాపాడుకోవచ్చన్నారు. వ్యాధి వచ్చిన తరువాత వైద్యం కోసం వేల రూపాయిలు ఖర్చు చేయడం కంటే ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలు వేయించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, ఎల్ఎస్ఏ శేఖర్, ఓఎస్‌లు పద్మమ్మ, శేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

**పెద్దేముల్, మార్చి 13, ప్రభాతవార్త:** భావితరాలకు రసాయన రహిత ఆహారం కోసం సేంద్రియ వ్యవసాయం దిశగా ముందడుగు వేయాలని సేంద్రియ వ్యవసాయ విభాగం కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి) లావణ్య సూచించారు. శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ రైతువేదికలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంలోని జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం వంటి కషాయాల తయారి పద్ధతుల వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ మాట్లాడుతూ పత్తి పంటలో అధిక సాంద్రత వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని, పంటకాలం కూడా 150 రోజులకి తగ్గుతుందని అన్నారు. ఆదర్శరైతు రుద్రారం నారాయణ మాట్లాడుతూ దేశి కంది, వరి వెరైటిలపై అవగాహన కల్పిస్తు చత్తీస్‌గడ్‌లోని కొండమాచల కాండి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, తాండూరు ఏడిఏ కొమురయ్య, ఆదర్శరైతు కిషన్‌రావు, ఆత్మకమిటి సభ్యులు బుద్దారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్, ఏఈఓలు చంద్రకళ, అపర్ణ, శివరత్, బిటిఎం శ్రావన్, బాలక్రిష్ణ, మాజీ యంపిటిసి వై శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

## ఎల్‌పిజి సిలిండర్స్ బ్లాక్ మార్కెట్లకు తరలిస్తే కఠిన చర్యలు

..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

..కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 13, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలో ఎల్‌పిజి సిలిండర్స్ వంటగ్యాస్ సంబంధించి ఎవరైనా బ్లాక్ మార్కెట్స్‌కు సిలిండర్స్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్పష్టం చేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొన్నారు. అయితే బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లతో, ఎస్‌పి లతో,పోలీస్‌కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్నందున మంత్రి ఉత్తమ్‌కుమార్, మంత్రి నాగేశ్వర్‌రావులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలు గ్యాస్ కొరతపై ఆందోళన వద్దని, గృహ అవసరాలకు సరిపడ ఎల్‌పిజి సిలిండర్స్ పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ వీడియో కాన్ఫరెన్స్ తరువాత మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కలిసి జిల్లా ఎనర్జీసప్లయ్ మానిటరింగ్ కమిటీ అధికారులతో జిల్లా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ బాట్లింగ్ ప్లాంట్ల వద్ద, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద,ఎల్‌పిజి సరఫరా వాహనాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఉండేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎవరైనా ఎల్‌పిజి సిలిండర్స్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే మాత్రం చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లాలో 52డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్స్ పంపిణీ జరుగుతుందన్నారు. వాటి డెలివరీలో ఏవనా ఆటంకాలు ఎదురైనపుడు జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబరు 040-29700820ను సంప్రదించాలన్నారు. గృహ సంబంధిత అవసరాలకు సరఫరా చేసే ఎల్‌పిజి సిలిండర్లను ప్రతి రోజు ఆర్డీఓలు, తహసీల్దార్లు, అసిస్టెంట్ సివిల్ సప్లయి అఫీసర్లు పర్యవేక్షించాలన్నారు.అసత్య ప్రచారాలు నమ్మవద్దని, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని గృహవినియోగానికి, ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, వృద్ధా ఆశ్రమాలకు, ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగ ఉందని అన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి,పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా అధికారుల దృశ్యం

## గ్యాస్ సిలిండర్ల కొరతపై అపోహాలు వద్దు

-సరఫరాపై అధికారుల ద్వారా సమాచారం

**ఘట్‌కేసర్, మార్చి 13, ప్రభాతవార్త:** ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో సోషల్ మీడియాలో గ్యాస్ కొరతపై వస్తున్న అపోహాలను ప్రజలు నమ్మకూడదని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఘట్‌కేసర్‌లోని ఈశ్వరా గ్యాస్ ఏజెన్సీ గోదాము, కార్యాలయానికి వచ్చి పరిస్థితిని తెలుసుకున్నారు. వినియోగదారులు ఏజెన్సీ వద్ద గ్యాస్ కోసం గుమిగూడటంతో ఆయన వారితో మాట్లాడి గ్యాస్ కొరత ఉండదని బుక్ చేసుకున్న వారు డెలివరీ కాకమందే తిరిగి బుకింగ్ చేయడం సరికాదని చెప్పారు. ఐఓసీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులకు ఫోన్ చేసి గ్యాస్ కొరతపై చర్చించారు. ఏజెన్సీ మేనేజర్ బోనకూర్తి వెంకటరమణతో మాట్లాడి గ్యాస్ సరఫరా అవుతున్న తీరు, బుకింగ్ వివరాలను తెలుసుకున్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని పలు దేశాల నుంచి ఇంధన, గ్యాస్ సరఫరాలు నిరంతరం కొనసాగుతున్నాయని సుదర్శన్‌రెడ్డి వివరించారు. సిబ్బందిలలో సిలిండర్లను బ్లాక్‌లో విక్రయిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. సిలిండర్ పొందిన తర్వాత తిరిగి గ్యాస్ బుక్ చేసిన వినియోగదారులు గ్యాస్ ఆఫీస్‌కు తిరిగకుండా సహకరించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపి ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, నాయకులు గాయరు రాజేశ్, గోదాము ఇంచార్జ్ సుమన్, డెలివరీ ఏజెంట్ రఫీక్, ఆపరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరా ఏజెన్సీలో గ్యాస్ సరఫరా వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి



గ్యాస్ వినియోగదారులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

## నేటి నుంచి 'పదవతరగతి' పరీక్షలు షురూ..

..ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

..జిల్లా వ్యాప్తంగా 237 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

..పరీక్షలు రాయనున్న 49,999మంది విద్యార్థులు

..జిల్లాలో హాజరు కానున్న 903 ఉన్నత పాఠశాలల విద్యార్థులు

..మేడ్చల్ జిల్లా విద్యా అధికారి విజయకుమారి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 13, ప్రభాతవార్త:**

పదవతరగతి విద్యార్థులకు వార్షిక పబ్లిక్ పరీక్షలు 14వ తేదీ (శనివారం) నుంచి ప్రారంభం అవుతున్నందున మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. పదవతరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 237పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో రెగ్యులర్ సెంటర్స్ 232 ఏర్పాటు చేయగా, 5సెంటర్లు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. మొత్తం 237 పదవతరగతి పరీక్షా కేంద్రాలకు సంబంధించి కస్టోడియం అధికారులు 237మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు 237మందిని నియమించారు.

ఒక కేంద్రానికి వారు ఇద్దరు చొప్పున నియమించారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 49,999మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 48,967మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రైవేట్ విద్యార్థులు 1,032మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 25,441మంది, బాలికలు 23,520మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలోని 21పోలీస్‌స్టేషన్స్‌లో పరీక్షా పత్రాల స్టోరేజీని ఏర్పాటు చేశారు. వీటిలో సైబరాబాద్ సిపి పరిధిలో 10 పిఎస్‌ల్లో స్టోరేజ్ పాయింట్స్ ఉండగ, మల్కాజ్‌గిరి సిపి పరిధిలో 11పిఎస్‌లలో స్టోరేజ్ పాయింట్స్‌ను ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఎన్ఎస్‌కెకె ఫీరోజ్‌గూడ,బాలానగర్‌లో ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు అడిషనల్ జాయింట్ కస్టోడియంలను 25మందిని నియమించారు. 8రూట్ ఆఫీసర్స్‌ను నియమించారు. సిఎస్,ఇన్విజిలేటర్స్,ఇతర సిబ్బందిని 2,769మంది పరీక్షా కేంద్రాలలో విధుల నిర్వాహణకు స్టాప్‌ను నియమించారు. ప్రతి రోజు పదవతరగతి పరీక్షలు ఉదయం 9.30గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30గంటల వరకు కొనసాగనున్నాయి. పదవతరగతి ప్రశ్నా పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు పంపటానికి, పరీక్షా కేంద్రాల వద్ద కూడ పోలీసు బందోబస్తును ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

**..ప్రశాంతంగా పరీక్షలు రాయటానికి ఏర్పాట్లు డిఇఓ..**

..ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా విద్యా అధికారి విజయకుమారి పేర్కొంటూ జిల్లా వ్యాప్తంగా పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగ నిర్వహించటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్, నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థుల కోసం పరీక్షల నిమిత్తం ఆర్టీసి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. విద్యార్థులు ముందుగానే చేరుకుని ఎలాంటి టెన్షన్ పడకుండ ప్రశాంతంగ పరీక్షలు రాయాలని విద్యార్థులకు డిఇఒ విజయకుమారి సూచించారు.



మేడ్చల్ జిల్లా విద్యా అధికారి విజయకుమారి మాట్లాడుతున్న దృశ్యం



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న సర్పంచ్ చందునాయక్

## ఇళ్ల పట్టాల పంపిణీ

**షాద్‌నగర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త :** ఫరూక్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామంలో నిరుపేదలకు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ధ్యేయంగా పనిచే స్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మరో 15 ఇళ్లు మంజూరు చేయ డానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిం చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత తిరుపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భీమ్లా నాయక్, బోజ్యానాయక్, గజేంద్రనాయక్, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మంగమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తదిరులు

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు పరామర్శ

**కడ్తాల్, మార్చి 13, ప్రభాతవార్త :** ఇటీవల మాతృ వియోగానికి గురైన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జి. జైపాల్ యాదవ్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో ఆయన తల్లి మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, సర్పంచులు శ్రీను నాయక్, గోపాల్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీ మ్మనరసింహారెడ్డి



ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న నేతలు

పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

**కుల్కచర్ల, మార్చి 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని చెల్లాపూర్ గామంలో నంచర్ల అనంతయ్యకు ఇందిరమ్మ ఇంటిని గురువారం గృహ ప్రవేశం నిర్వహించారు. సర్పంచ్ శకుంతల కేశవులు స్థానిక నాయకుతలో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు, పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, ఘణపూర్ సర్పంచ్ రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేలరాలిన అరుణ తార

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడి రంగారెడ్డి, మాజీ మంత్రి పి. ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులు కొండిగారి రాములు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నిజాయితీకి, విలువలకు మారుపేరుగా నిలిచిన ఒక గొప్ప నాయకుడిని కోల్పోయాం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కాగా కొండిగారి రాములు అంత్యక్రియలు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు.

# నూతన ఆలోచనలతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కేపీఆర్ఐటిలో ఎస్ఏపి కోడ్ ఎన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పనాశాఖ వివేక్



మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న కేపీఆర్ఐటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

**-నైపుణ్యతను పెంపొందించుకోవడం అవసరం**

**ఘట్‌కేసర్, మార్చి 13, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి ఎస్ఏపీ కోడ్ ఉన్నతి ఇన్నోవేషన్ మారథాన్ 4.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిధిగా విచ్చేసి సాప్ కోడ్ రూమ్‌ను రిబ్బన్ కత్తిరించి విద్యార్థులకు అంకితం చేశారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలను అభివృద్ధి చేసుకునేందుకు సాప్ కోడ్ సెంటర్ ద్వారా అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరమం ఎంతైనా ఉందన్నారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తమ తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. కొత్తగా వస్తున్న సాంకేతికతకు భయపడకుండా వాటిని నేర్చుకొని నైపుణ్యతను సాధించాలని మంత్రతి సూచించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, మంత్రి వివేక్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు మంత్రి వివేక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కేపీఆర్ఈఎస్ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజీ డైరెక్టర్ కొమ్మూరి దివ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈఓ శ్రీకాంత్‌సిన్హా, హైదరాబాద్ జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, ఎడునెట్ ఫౌండేషన్ అసోసియేట్ డైరెక్టర్ సందీప్‌కౌర్, ఎస్ఏపి సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ ముజాదిద్‌సాద్ మహమ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌కాశ్యప్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య పరిపాలనాధికారి గుండ నాగరాజు, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు నానావత్ సురేశ్‌నాయక్, వేముల శంకర్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
III ADDITIONAL DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT
AT: L.B. NAGAR
O.S. NO. 470 OF 2015

BETWEEN:
Smt. B. Hamsamma and others ...Paintiff
AND
Sri. B. Laxmaiah & Others. ...Defendants

To
Defendant No. 8: Smt. Balaboina Sattamma, D/o. Late Ch. Pochaiah, Aged: Major, Occ: not known to the plaintiffs, R/o. H.No. 1-92/1, Balijaguda Village, Abdullapurmet Mandal, Ranga Reddy District-501509.

Please take notice that the Plaintiff has filed above suit, for Partition and separate Possession against Defendants. The Defendant No. 8 in the above suit several times summons were issued and deliberately avoiding, thereafter the Hon 'ble Court has ordered to substitute the services in the News Paper. Now the matter stands posted on 06-04-2026 at 10.30 A.M. for your appearance either in person or through advocate, failing which the matter would be decided as per law.

(BY ORDER OF THE COURT)

VIJAY B PAROPAKARI
DANDU PRABHU
ADVOCATES
H.No. 5-1-125, Gowliguda,
Near BSNL Office, Jambagh,
Hyderabad-500 001. T.S.
Cell: 7013210013

## పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యం..

**అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి..**

**షాద్ నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కచ్చితంగా ఒక బాధ్యతగా భావించాలి.. లేదంటే భవిష్యత్ ఇంకా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.. దీనివల్ల దేశం సమస్యల్లో చిక్కుకొని జిడిపి పైన ప్రభావం పడే అవకాశం ఉంటుందని షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి సూచించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్పాన్సర్స్ తో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ రిసోర్సెస్ క్లీన్ ఎన్విరాన్మెంట్ ఇన్ ఇండియా పేరుతో జరుగుతున్న జాతీయ సెమినార్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న ఆయన పర్యావరణం క్షీ నణిత దేశ ఆర్థిక వ్యవస్థ పై దాని ప్రభావం అనే అంశం మీద పరిశోధనా పత్రాన్ని సమర్పించాడు. ప్రతి ఒక్కరూ తమ సౌకర్యం కోసం ఏదో ఒక రూపంలో వాయు నీరు కాలుష్యానికి అటవీ నిర్మూలనకు కారణం అవుతున్నారని, వీటి వల్ల జరిగే అనర్థాలను డేటాతో సహా ఆయన వివరించారు. దీనివల్ల దేశ జీడీ పిలో మూడు శాతం వరకు నష్టం జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ జలపతి హాజరైనట్లు వివరించారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి

## ప్రజా ఎజెండా అమలు పరచండి

**మున్సిపల్ చైర్మన్ కు సామాజిక వేత్త వంగూరి గంగిరెడ్డి విజ్ఞప్తి**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూరి బసవేశ్వర్ సామాజికవేత్త వంగూరి గంగిరెడ్డిని వారి స్వగృహంలో కలిసి పట్టణంలోని సమస్యలను గురించి చర్చించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ కు మిఠాయిలు తినిపించి శాలువా కప్పి గంగిరెడ్డి సన్మానించారు. అనంతరం ఎన్నికల సమయంలో పట్టణంలోని ప్రజల ఆకాంక్షలుగా వెలుగులోకి వచ్చిన సమస్యలను క్రోడీకరించి" ప్రజా ఏజెండాగా" గంగిరెడ్డి రూపొందించిన వినతిపత్రాన్ని చైర్మన్ కు అందజేశారు. వాటిని పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో అమలు పరిస్తే షాద్ నగర్ పట్టణ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. ప్రజాఎజెండాలోని అంశాలపై వారిద్దరి మధ్య విస్తృత చర్చ జరిగింది. వినతి పత్రంలోని అంశాలపై చైర్మన్ బసవేశ్వర్ సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో వాటిని అమలుపరచి షాద్ నగర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.



మున్సిపల్ చైర్మన్ సన్మానిస్తున్న దృశ్యం

## సొంత ఇంటి కల సాకారం

**కౌన్సిలర్ ఎస్పీ శివ నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ**

**26వ వార్డులో 7 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** పేద ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల ఈరోజుతో తీరిపోయిందని తన వార్డులో 7 మందికి శుక్రవారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసినట్లు కౌన్సిలర్ ఎస్పీ శివ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో తన వార్డుకు సంబంధించి నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేసినట్లు ఎస్పి శివ పేర్కొన్నారు. ఈరోజు 7 మందికి ఇళ్లకు సంబంధించిన పట్టాలను అందజేసినట్లు తెలి పారు. లబ్ధిదారుల వివరాలను ఎస్పీ శివ మీడియాకు విడుదల చేశారు. కటికల పద్మ, డివిటి సాయి లత, అబేధా బేగం, డివిటి శివలీల, ఎండ్ల సుజాత, మినుగుల చంద్రమ్మ, ఉషగళ్ళ లలిత, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసినట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.



డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ప్రెసిడెంట్లను అందజేస్తున్న కౌన్సిలర్ ఎస్పీ శివ

## వెలలేని కవిత్వానికి చిరునామా కవయిత్రి మొల్ల..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** తొలి తెలుగు కవయిత్రి గా వెల్లలేని విలువైన కవిత్వాన్ని తెలుగు ప్రజలకు అందించిన మహా కవయిత్రి మొల్ల అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసించారు. షాద్ నగర్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాల వేసిన అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు కవయిత్రులలో తొలితరం కవయిత్రిగా పేరు మోసిన ఆమె రామాయణాన్ని వేద భాషల్లో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు భాషలో అందించడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. ఎందరో మహా రచయిత్రులు మన తెలుగు తేజాలు వెలగడానికి ఆమె స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. తెలుగువారు ఉన్నంతకాలం, తెలుగు సాహిత్యం వెలుగులు పంచినంత కాలం ఆమె మన హృదయాల్లో ఉంటారని ప్రశంసించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. షాద్ నగర్ కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికూడ శ్రీశైలం మరియు ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగనూరి బస్వం, మరియు కుమ్మరి సంఘం ఉపాధ్యక్షులు శ్రీశైలం, గ్రంథాలయం డైరెక్టర్ చంద్రశేఖర్ సాయిలు, పెంజర్ల రమేష్, వైన్స్ అంజయ్య, దూసకల్ రమేష్, బ్రహ్మయ్య, నరసింహ, వెంకటేష్, బాలరాజ్, కృష్ణ, ఆటో శ్రీను, రాపోల్ వెంకటేష్, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

## శామీర్‌పేట మండలంలో ఏడు పదవతరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**..శామీర్‌పేట మండల ఎంఇఓ కమలాకర్**

**శామీర్‌పేట, మార్చి 13, ప్రభాతవార్త:**

శామీర్‌పేట మండలంలోని పదవతరగతి పరీక్షల నిర్వాహణ కోసం వివిధ గ్రామాల్లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని, శనివారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభం అవుతున్నట్లు శామీర్‌పేట మండల ఎంఇఓ కమలాకర్ తెలిపారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం 7పరీక్షా కేంద్రాలు ఏర్పాటు జరిగినట్లు అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. 25పాఠశాలలకు చెందిన విద్యార్థులు 1530మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలు శామీర్‌పేట, తూంకుంట, అలియాబాద్ ఆయా గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో , అదే విధంగా హకీంపేట్ స్పోర్ట్సు స్కూల్‌లో, తూంకుంటలోని విజ్ఞాన్ భారతి స్కూల్, మజీద్‌పూర్‌లోని టి.చైతన్య హైస్కూల్, అలియాబాద్‌లోసి సెంట్‌జోసెఫ్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు జరిగినట్లు, విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు రాయటానికి ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులలో ఉంటుందన్నారు. మంచినీరు, వైద్య సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, టాయ్‌లెట్లు అన్ని ఏర్పాట్లు ఉన్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా అనుమానాలు ఉంటే 91-7893 276636నెంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని ఎంఇఓ కమలాకర్ తెలిపారు.

## విద్యార్థులపై దాడి చేసిన గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ గుర్తింపు రద్దు చేయాలి

**-జేఎన్టీయూ, గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ కుమ్మక్కై విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు**

**-ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్ బేగరి అరుణ్ కుమార్**

**మొయినాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ముందు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్లోబల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కంసాలిడేషన్ ఫీజు ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారని జెఎన్టియుకు మెయిల్ ద్వారా కంప్లీట్ చేయడం జరిగింది జేఎన్టీయూకు కంప్లీట్ కళాశాలపై చేస్తారని కక్ష పెంచుకొని కళాశాల వైస్ ప్రిన్సిపల్ అహ్మద్ జిసన్ ఫ్యాన్ మల్లేష్ తో కలిసి మిగిలిన అధ్యాపకుల ముందు దాదాపు రెండు గంటలు గదిలో బంధించి కళాశాలకు చెందిన సి ఎస్ యి మూడవ సంవత్సరం విద్యార్థులు మహమ్మద్ సాదిక్ వి క్రితిక్ రెడ్డి హైమత్ అబ్రార్ నితీష్ కుమార్ సంతోష్ మరియు సి ఎస్ డి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉదయ్ హాజరత్లపై గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ అహ్మద్ జీషన్ సహాయకుడు మల్లేష్ ఇతర అధ్యాపకుల ముందు విద్యార్థుల ప్రైవేట్ పార్ట్స్ పై దాడులు చేశారని అన్నారు జేఎన్టీయూ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల కుమ్మక్కై విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు విద్యార్థులపై దాడి చేసిన కళాశాల అధ్యాపకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షులు రేశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు కెరీర్ దిశా నిర్దేశం

**..300మంది విద్యార్థులకు హ్యాండ్ బుక్స్, టెన్త్ పరీక్షల కిట్స్ ఉచితంగా పంపిణీ**

**శామీర్‌పేట, మార్చి 13, ప్రభాతవార్త**

శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు అలియాబాద్ బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి కెరీర్ గైడ్స్, పదవతరగతి పరీక్షల కిట్స్‌ను సుమారు 300మంది విద్యార్థులకు ఉచితంగ పంపిణీ చేసినట్లు ఆ సొసైటీ నిర్వాహకులు బండి రాంరెడ్డి, బండి శ్రీకర్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులకు భవిషత్ విద్యా అవకాశాలపై సొసైటీ నుంచి రూపొందించిన కెరీర్ గైడ్స్ ఉపయోగపడుతుందని, పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులను ప్రోత్సహించటానికి పరీక్షల కిట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు భవిషత్ విద్యా అవకాశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ మార్గదర్శకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ భవిషత్‌లో మంచి విజయాలు సాధించాలని ఆకాక్షించారు. పదవతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు.




కొల్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వర్గీయ బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడ్స్,పరీక్షల కిట్స్‌ను ఉచితంగ పంపిణీ చేసిన దృశ్యం

# ఆర్టీఓ ఏజెంట్ కార్యాలయం ప్రారంభం

**షాద్‌నగర్ టౌన్, మార్చి 13, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణం భగీరథ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీఓ ఏజెంట్ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలను సులభంగా అందించేలా ఇలాంటి కార్యాలయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

అనంతరం యాజమాన్యం కృష్ణ, రమేష్ కి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ మాజీ ఎంపీటీసీ కాట్న శ్రీశైలం, నాయకులు రవి యాదవ్, పాష, సంతోష్, రమేష్, టి. రమేష్, వెంకటేష్, శేఖర్, రాకేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీవో ఏజెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి తదితరులు

## భద్రతా ప్రమాణాలపై నిరంతర పర్యవేక్షణ

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13, ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-కార్యాచరణలో భాగంగా అగ్నిమాపక భద్రతపై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ ఏఎస్‌బీఎల్ స్ప్రింగ్స్ అపార్టుమెంటులో మున్సిపల్ మరియు అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ప్రాణ ఆస్తి నష్టాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో సిబ్బంది స్పందిచే విధానంపై అక్కడి నివాసితులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఘట్‌కుసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ ప్రజల భద్రతే లక్ష్యంగా 99 రోజుల ప్రణాళికలో భాగంగా అన్ని ప్రధాన భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఐటీ కారిడార్లలో భద్రతా ప్రమాణాలు నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. చంద్రశేఖర్, ఎస్‌డబ్ల్యూఎం ఏఈ. ఈ. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ కాలేజీకి రెండు అదనపు గదులు

**కీసర, మార్చి 13, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిం చాలని అభయ ఫౌండేషన్ వాలెన్స్ మాలిక్యూర్ డైరెక్టర్ స్వామి బాలచంద్ర అన్నారు. శుక్రవారం కీసరగుట్టలోని టిజిఆర్ఎస్ జెసికి రెండు అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పాటు విద్యారంగ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా చేసుకుని అభయ ఫౌండేషన్ తరపున సిఎస్ఆర్ నిధులతో తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ కీసరగుట్టలో సుమారు 10 లక్షలతో నిర్మించిన రెండు నూతన తరగతి గదులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ నిర్మాణ పనుల ద్వారా విద్యార్థులకు అదనపు గదులు కల్పించడంతో పాటు విద్యా నాణ్యతను మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేయలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాలెన్స్ మాలిక్యూర్ ప్రతినిధి భాగారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ నర్సింహ్మ, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.




ప్రారంభిస్తున్న అభయ ఫౌండేషన్ డెరెక్టర్ స్వామి బాలచంద్ర

## నర్సరీలతో పచ్చని వాతావరణం

**మల్లాపూర్‌లో ముమ్మరంగా పల్లె ప్రగతి పనులు**

**కొత్తూరు మార్చి13,ప్రభాతవార్త :** కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చేయాలనే లక్ష్యంతో గ్రామ నర్సరీ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామంలోని నర్సరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని నర్సరీ శుభ్రపరిచే పనులు మరియు మొక్కల పెంపకం కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, పెద్దఎత్తున మొక్కలు నాటడం, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం, నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా పల్లెలను ఆదర్శ గ్రామాలుగా, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రాణి, జయేందర్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యుడు చిర్ర రాజు, పాపిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



నర్సరీ పనులు ప్రారంభిస్తున్న పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ,తదితరులు

## ఆకట్టుకున్న చిన్నారుల స్వయం 'స్వపరిపాలన'

**కొత్తూరు, మార్చి 13, ప్రభాతవార్త :** కొత్తూరు మున్సిపల్ పరిధిలోని ఎస్వీఆర్ స్కూల్లో గురువారం స్వయం స్వపరిపాలన దినోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై స్కూల్ విద్యార్థులు ఒక రోజు పాటు డీఈఓ, ఎంఈఓ, స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల పాత్రలు పోషిస్తూ బోధన కార్యక్రమాలను నిర్వహించి చిన్నారులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు బాధ్యతలను స్వయంగా చేపట్టి తరగ తులను నిర్వహించడం కార్య క్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ కరస్పాండెంట్ వీరమోని దేవేందర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిపాలన వ్యవస్థను అనుభవాత్మకంగా తెలుసుకునే అవకాశం కలిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బివి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆనంది, ఉపాధ్యాయులు, భాగ్య సంధ్య శోభ అర్చన మోహిన మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు




మాట్లాడుతున్న సర్పంచ్ లావణ్య చెన్నయ్య

## ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

**సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య**

**షాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం గ్రామంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటిలో ఉన్న వినియోగించిన కొబ్బరి బోండాలు, పై కప్పు పై గల వినియోగం లో లేని టైర్లు, కుండీలు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుందని, విధిగా ప్రతి శుక్రవారం వాటిలో గల నీటిని తీసివేయాలని చెప్పారు. లేనిచో దోమలు పెరిగి అనేక రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని వివరించారు. చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లోనే వేయాలని అన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ గణపురం ప్రభాకర్, వార్డు సభ్యులు కె. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కుమ్మరి శివ రాములు, చీమల వెంకటయ్య, పి. అంజిరెడ్డి, పి. అశోక్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల 12వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**చేవెళ్ల, మార్చి 13, ప్రభాతవార్త :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం 12వ వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో కౌన్సిలర్ అతెల్లి మనీషా అనంతరెడ్డితో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి మాట్లాడుతూ... పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని కోరారు. పరిశుభ్రతపై ప్రజలు అవగాహనతో సహకరిస్తేనే పట్టణం స్వచ్ఛంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు బండారు శైలజ ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణా నాయక్, వార్డు ఆఫీసర్ చంద్రకాంత్, భాజపా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అశోక్, గణేష్, ప్రశాంత్ రెడ్డి, కాలనీ వాసులు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, సాయి కిరణ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

## విద్యార్థులపై దాడి ఘటనపై ఎస్ఎఫ్ఐ ఆందోళన




ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులు

**చేవెళ్ల, మార్చి 13, ప్రభాతవార్త :** మొయినాబాద్‌లోని గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులపై ఫిర్యాదు చేసిన విద్యార్థులపై యాజమాన్యం కక్ష సాధింపుతో వైస్ ప్రిన్సిపాల్ అహ్మద్ జీషన్, సహాయకుడు మల్లేష్ దాడి చేశారని ఆరోపించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ధారూర్ ఎంఈఓ చెన్నయ్య**

**ధారూర్, మార్చి 13, ప్రభాత వార్త:** నేటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ధారూర్ మండలంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి చెన్నయ్య తెలిపారు. మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 324 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందులో జెడ్పిహెచ్ఎస్ ధారూర్ (బాలుర) కేంద్రంలో 170 మంది, జెడ్పిహెచ్ఎస్ కేరెల్లి కేంద్రంలో 154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శుక్రవారం కేరెల్లి, ధారూర్ పాఠశాలను సందర్శించి పరీక్షా గదులు, ఇతర వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వెలుతురు, ఫర్నిచర్ వంటి అన్ని సౌకర్యాలను సవ్యంగా ఏర్పాటు చేశామని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.





ఇందిరమ్మ ఇళ్లు యజమానులకు నూతన వస్త్రసాలను అందజేస్తున్న మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు

## అందరి ఆనందం ఇందిరమ్మ రాజ్యంలోనే

**జిల్లెడు చౌదరిగూడ,మార్చి 13,(ప్రభాతవార్త):** ప్రజలందరూ ఆనందంగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంలేనేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి, పెద్ద ఎల్కిచర్ల గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ యజమానులకు ఆయన నూతన వస్త్రాలు పెట్టారు. తమ ఇంటి పెద్దవలే నూతన వస్త్రాలు పెట్టడం ఎంతో గొప్ప విషయమని ఇందిరమ్మ ఇల్లు యజమానులు అన్నారు. అనంతరం చలివేంద్రంపల్లి రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కన్నతల్లిలాంటిదని అన్నారు . ప్రతి ఒక్కరిని తమ బిడ్డలవలే భావిస్తుందని ఆయన పెర్కొన్నారు. రాబోయే జోరుల్లో అనేక పథకాలు ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాంచంద్రయ్య, బందయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, యాదయ్య, మల్లేష్, సలీం, లింగంగౌడ్, శ్రీనివాస్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



నూతన భవన పనులు పరిశీలిస్తున్న నేతలు

## రాంపూర్‌ని అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**సర్పంచ్ తిరుపతయ్య**

**కుల్కచర్ల, మార్చి 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే వెనుకపడ్డ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సర్పంచ్ తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మహిళా సమైఖ్య భవనం స్లాబు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మారినా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేవని కాంగ్రెస్ ప్రభుత్వంలో వెనుకపడ్డ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రాంపూర్ గ్రామాన్ని అదర్శ గ్రామంగా తీర్చి దిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండల రేగడి మామిడిపల్లిలో అంతర్గత సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచులు భూపతిరెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

## రేగడి మామిడిపల్లిని అభివృద్ధి చేయిస్తా

**సర్పంచ్ చుక్కన్నగారి భూపతిరెడ్డి**

**పూడూరు, మార్చి 13, ప్రభాతవార్త :** అందరి సహకారంతో రేగడి మామిడిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయిస్తానని సర్పంచ్ చుక్కన్నగారి భూపతి రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలపరిధిలోని రేగడి మామిడిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ క్రింద మంజూరి అయిన రూ. 10లక్షల నిధులతో శుక్రవారం అంతర్గత సిసిరోడ్డు నిర్మాణపు పనులను మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బురిగేరి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి గ్రామానికి అత్యధిక నిధులు వ్యచ్చించడం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామంలో అక్కడక్కడ మురుగునీరు ప్రవహిస్తున్నందున ఈ సమస్య పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఆయా కాలనీల్లో నీటి సరఫరా అయ్యే పైపుల లీకేజీలకు మరమత్తులు చేసి సరి చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని వీధుల్లో స్ట్రీట్‌లైట్లను అమర్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగమణి, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత

**జిల్లా అదనపు ఎస్పి రాములు నాయక్**

**కుల్కచర్ల, మార్చి 13, ప్రభాతవార్త :** ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని జిల్లా అదనపు ఎస్పి రాములు నాయక్ అన్నారు. శుక్రవారం పాంబండ రామలింగేశ్వర స్వామి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. ఆధ్యాత్మికత, క్రమశిక్షణ, నిజాయితీగా జీవించడానికి అలవాటును నేర్పిస్తుందన్నారు. ప్రతి వ్యక్తి భక్తి భావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, అలయ అర్చకులు పాండు శర్మ తదితరులు పాల్గొన్నారు.





విలేకరులతో మాట్లాడుతున్న సి ఓ నాగరాజు,సహాయకులు మహేష్

## సకాలంలో రుణాలు చెల్లించండి

**సిఓ ముమ్మిడి నాగరాజు**

**యాచారం, మార్చి 13, ప్రభాతవార్త:** దీర్ఘకాలిక ఋణాలు పొందే రైతులందరూ సకాలంలో తిరిగి చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని యాచారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇ ముమ్మిడి నాగరాజు కోరారు. శుక్రవారం మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ఋణాలు సకాలంలో చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. గతంలో ఈ యాచారం మండలం సహకార సంఘంలో రుణాలు చెల్లించడంలో ముందంజలో ఉండే వారమని నేడు అందుకు భిన్నంగా ఉందని అన్నారు. రైతులందరూ పంట రుణాలపై వడ్డీ చెల్లించి రుణాలను పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు. రైతులందరూ సహకార సంఘాన్ని అభివృద్ధి కోసం మన అనే ఆలోచనతో రుణాలు చెల్లించి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రఘునాథ్

## వార్డు సభ్యులకు అవగాహన

**యాచారం, మార్చి 13, ప్రభాతవార్త:** యాచారం మండలం కేంద్రంలో వార్డు సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ శాఖ, ఆత్మ వారి ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల, ప్రకృతి వ్యవసాయ, హెచ్టిబిటి కాటన్‌పై అవగాహన శిక్షణ కార్య క్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో మట్టి నమూనాల సేకరణ, పరీక్ష ఫలితాలపై, విత్తనాల ఎంపిక, ఎరువులు వాడే విధానం లు, ఎరువుల యాప్ గురించి, పంటమార్పిడి పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ విధానంలు, రైతు భరోసా, రైతు భీమా, పీఎం కిసాన్, రైతు రిజిస్ట్రేషన్, కపాస్ కిసాన్ యాప్ గురించి, కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయ యంత్రాలు సబ్సిడీ గురించి, ఎస్ పి ఓ ఎస్ , పంట రుణాలు గురించి, పంట నమోదు గురించి, వివిధ వ్యవసాయ వివరాల గురించి తెలియజేశారు. ఈ కారక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఆత్మ సిబ్బంది, వార్డు సభ్యులు, అభ్యుదయ రైతులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నక్క సందీప్‌గౌడ్‌కు అభినందనల వెల్లువ

## ..రాజకీయంగా మరింత రాణించాలి ..మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

**శామీర్‌పేట, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్‌గౌడ్‌కు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దిన్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిలు సన్మానించి అభినందనలు తెలియజేశారు. శుక్రవారం శామీర్‌పేటలోని ఎస్‌పిజి డ్రీమ్ వల్లీ వద్ద రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ కుమారుడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా వారితో పాటు పలువురు నాయకులు పాల్గొని అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్‌గౌడ్ రాజకీయంగా మరింత రాణించాలని ఆశీస్సులు అందజేశారు. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, నక్క ప్రభాకర్‌గౌడ్ అభిమానులు విచ్చేసి కేక్‌లు కట్ చేయించి శాలువాలతో సన్మానించి వేడుకల్లో పాల్గొని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, శామీర్‌పేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, వి.అశోక్, మేడ్చల్ ఎఎంసి మాజీ చైర్మన్ సత్యనారాయణ, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బి.శ్రీనివాస్, అదే విధంగా మార్కెట్ కమిటీ పలువురు డైరక్టర్లు, ఆలయాల చైర్మన్లు, ధర్మకర్తలు, మున్సిపాల్టీల కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు, మాజీ చైర్మన్లు, మాజీ వైస్‌చైర్మన్లు, మాజీ కార్పోరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మండలాల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంఘాల వారు, అభిమానులు తదితరులు పాల్గొని నక్క సందీప్‌గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు.



.శామీర్‌పేటలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్‌గౌడ్‌ను సన్మానించి అభినందనలు తెలిపిన మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి,యఅలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి,జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, పలువురు నాయకుల దృశ్యం

# హెల్మెట్ లు ధరిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం

**బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** మోటార్ సైకిల్ పై ప్రయాణం చేసేవారు తప్పకుండ హెల్మెట్ ధరించి సురక్షితంగా మీ గమ్యాలకు చేరాలని అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా తెలంగాణ డయో గ్నోస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం షాద్ నగర్ పట్టణంలో స్థానిక బుగ్గారెడ్డి గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, ఏసీపీ లక్ష్మీనారాయణ హాజరుకావడం జరిగింది. విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రమాదాల వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. మోటార్ సైకిల్ పై ప్రయానించే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే విదంగా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ దరిస్తే ప్రమాధాలు తగ్గుతాయని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రమాధాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణాలు నిలబెట్టిన వారు అవుతారని అన్నారు. రక్త దానం చేసిన వారిని విష్ణువర్ధన్ రెడ్డి అభినందించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమంలో డాక్టర్ అనురాగ్ రెడ్డి, అరవింద్, యువసత్త లక్ష్మణ్, పోతుల శ్రీకాంత్, అనిల్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్, చెవుల బాస్కర్, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

# వారెవ్వా.. శభాష్ కౌన్సిలర్

**స్తంభం ఎక్కిన కౌన్సిలర్...**

**లైట్లు బిగించి ప్రజల మనసులు గెలిచిన దాది నరసింహా**

**మేడ్చల్, మార్చి 13, ప్రభాతవార్త :** సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన తర్వాత కౌన్సిలర్లు ఒక స్థాయి (స్టేటస్)ని కొనసాగిస్తూ ప్రజల సమస్యలను అధికారులకు చెప్పి పరిష్కారం చేయించే నాయకులుగా కనిపిస్తారు. కాని కొందరు మాత్రం మాటల్లో కాదు, చేతల్లోనే ప్రజాసేవ అంటే ఏమిటో చూపిస్తారు. అలాంటి సంఘటన ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో చోటుచేసుకుంది. శ్రీరంగవరం గ్రామంలో శ్రీ రంగనాయక స్వామి, భవాని రామలింగేశ్వర స్వాముల వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరుగుతున్న సందర్భంగా గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయితే స్వామి వార్ల పల్లకి సేవ కార్యక్రమం రాత్రి సమయంలో జరుగునున్నందున ఆ ప్రాంతంలో సరైన వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లో కార్యక్రమం జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై మున్సిపల్ అధికారులను, సంబంధిత సిబ్బందిని సంప్రదించి వీధి లైట్లు వేయాలని కౌన్సిలర్లు కోరినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, చివరకు ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని 17వ వార్డు కౌన్సిలర్ దాది నరసింహ స్వయంగా ముందుకు వచ్చారు. ఎవరి కోసం ఎదురు చూడకుండా తానే స్తంభాలు ఎక్కి వీధి దీపాలు బిగించి వెలిగించడం అక్కడి ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒక ప్రజాప్రతినిధి స్వయంగా ఇలా స్తంభాలు ఎక్కి పని చేయడం చూసిన గ్రామస్థులు ఆయనను అభినందిసు _న్నారు. సాధారణంగా నాయకులు ఆదేశాలు ఇవ్వడమే తప్ప ఇలాంటి పనుల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం అరుదు. కానీ దాది నరసింహ మాత్రం ప్రజల పని అంటే నా పని అన్నట్టుగా వ్యవహరించడం ఇప్పుడు గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో కూడా చర్చలు జరుగుతూ కొందరు సరదాగా ట్రోల్ చేస్తూ వారేవా.. శభాష్ కౌన్సిలర్ అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజాప్రతినిధి అంటే కేవలం పదవి కాదు.. ప్రజల సమస్యను తన సమస్యగా భావించి ముందుండి పరిష్కారం చేసే వ్యక్తి అని దాది నరసింహ చేసిన ఈ చర్య మరోసారి నిరూపించింది చెప్పేవాళ్లు చాలామంది ఉంటారు. చేసి చూపేవాళ్లు కొందరే అని గ్రామస్థులు



ఎల్లంపేట మున్సిపాలిటీలోని శ్రీరంగవరం గ్రామంలో స్తంభం ఎక్కి వీది లైట్లను బిగిస్తున్న వార్డు కౌన్సిలర్ దాది నర్సింహ

# వైభవంగా వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవం

**యాచారం, మార్చి 13, ప్రభాతవార్త:** యాచారం మండల కేంద్రంలోని తిరుమలేశుని గుట్టపై గల స్వామి వారికి మూడు రోజుల ఉత్సవ కార్యక్రమాలు గురువారం నుండి ప్రారంభించారు. శుక్రవారం స్వామివారికి అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. సర్పంచ్ మస్కు అనిత శరణం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి కళ్యాణాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని సుమారాన్ని గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కళ్యాణాన్ని తిలకించారు. కొండపై నుండి వెంకటేశ్వర స్వామి పద్మావతి అలివేలు మంగ సమేత దేవత మూర్తులను తీసుకువచ్చి కళ్యాణం ఏర్పాట్లు వైభవంగా జరిపారు. స్వామివారికి ఇష్టమైన లడ్డూలను భక్తులకు అందజేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి పాల్గొని స్వామివారికి కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉప్పల భాస్కర్, రెడ్డి వెంకట్ రెడ్డి, నాయని సుదర్శన్ రెడ్డి, వార్డు సభ్యులు మారోజు ప్రదీప్, ఆకుల అశోక్, కొండాపురం శ్రీకాంత్, కొండాపురం శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో తిరుమలేశుని కళ్యాణ మహోత్సవం

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 13, (ప్రభాతవార్త):** గ్రామాభివృద్ధిలో ప్రజలందరు బాగస్వాములు కావాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ గ్రామంలోని వివిద కార్యమాలు చేపట్టారు. గ్రామంలోని మొక్కలకు నీటి పట్టారు. ఆయా కాలనీలలో చెత్త చెదారం ఎత్తివేసి శుబ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందయ్య, టెక్నికల్ అసిస్టేంట్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.



మొక్కలకు నీరు పడుతున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

## ఆర్కపల్లిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు

**ఏర్పాటు చేసిన సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి**

**మాడ్గుల, మార్చి13, ప్రభాతవార్త:-** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆర్కపల్లి గ్రామంలో ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందును గ్రామ సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామంలోని ముస్లిం కుటుంబాలతో కలిసి స్నేహభావ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం పరస్పర సౌభ్రాతృత్వానికి ,సహనానికి ప్రతీక అని తెలిపారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు ఐక్యంగా, సఖ్యతతో జీవించడం ఆనందంగా ఉందని అన్నారు. ముస్లిం సోదరులు ఉపవాసం ముగిసిన అనంతరం ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో మత సామరస్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని పలువురు అభిప్రాయపడ్డారు.



ఇస్తారు విందులో పాల్గొన్న నాయకులు

## కడ్తాల్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కడ్తాల్, మార్చి13, ప్రభాతవార్త:-** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పట్టణంలోని ఎంబిఏ గార్డెన్‌ఖిలో ముస్లిం సోదరులకు మాజీ కోప్షన్ సభ్యుడు, వార్డు సభ్యుడు జహంగీర్ బాబా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీ పీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నరసింహ, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ సర్పంచ్ రాయి కంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి విందు స్వీకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## ముస్లిం భాయ్‌కి బ్రాహ్మణ ఫలహారం..

**బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు వావిలాల సుజీవన్ కుటుంబ సభ్యుల ఔదార్యం..**

**పళ్ళు, ఫలహారాలు, స్వీట్లు అందజేత..**

**భార్యా పిల్లలతో కలిసి స్వయంగా సిద్ధం చేసిన సుజీవన్..**

**షాద్‌నగర్, మార్చి 13, ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ మాసం.. ముస్లింలు ఉపవాస దీక్షలు చేసే సమయం.. సాయంత్రం ఉపవాస విరమణ సమయంలో అల్పాహారం.. ఈ అల్పాహారాన్ని ఇఫ్తార్ విందు అంటారని అందరికీ తెలుసు.. ప్రస్తుతం ఇఫ్తార్ విందును ముస్లిం కుటుంబాలకు ఒక బ్రాహ్మణ సోదరుడి కుటుంబం అందజేస్తుండడం ఇక్కడ ప్రత్యేకం.. ఆ కుటుంబం ఎవరిదో కాదు షాద్ నగర్ బ్రాహ్మణ సేవా సమాఖ్య పట్టణ అధ్యక్షుడు వావిలాల సుజీవన్ కుటుంబం. కాంగ్రెస్ నేతగా, మాజీ వార్డు సభ్యుడుగా అందరికీ పరిచయం ఉన్న సీనియర్ నేత సుజీవన్ ఈ కార్యక్రమాని కి శ్రీకారం చుట్టారు. పవిత్ర రంజాన్ సందర్భంగా హిందూ ముస్లింల మధ్య సోదర భావాన్ని చాటుతూ ఇంటి నుంచి ఇఫ్తార్ ను సిద్ధం చేసి ముస్లిం సోదరులకు పంపించారు. ఇందులో ఆయన కుటుంబ సభ్యులు కూడా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా సుజీవన్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం ముస్లింలకు అన్ని విధాల శుభాలు కలిగించాలని కోరుకుంటూ తన వంతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముస్లిం సోదరులతో తనకు మొదటి నుంచి ఎంతో అనుబంధం వద్దని, వారి కుటుంబంలో తాను ఒక సభ్యుడిగా మెలిగానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు.



అందజేసేందుకు పండ్లను అమర్చుకున్న దృశ్యం

## చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**చేవెళ్ల, మార్చి 13, ప్రభాతవార్త :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్ దామరగిద్దలో రాంచందర్, హనోక్ ఆనంద్, భీంరాజ్, ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఓ ఫామ్ హౌస్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తమ వంతుగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, తాలపల్లి నర్సిములు, మధుసూదన్ రెడ్డి, అడ్వకేట్ గోపాల్ గౌడ్, టీచర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దృశ్యం

# పీపుల్స్ డిగ్రీ కళాశాలలో ఘనంగా వికసిత్ భారత్

**-- విద్యార్థులకు ఉపన్యాస పోటీలు**

**తాండూరు, మార్చి 13, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2026 కార్యక్రమాన్ని ఘనంగా జరపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వివిద కళాశాలల విద్యార్థులు 50 సంవత్సరాల క్రితం అత్యవసర పరిస్థితి, భారత ప్రజాస్వామ్యం, నేర్చుకున్న పాఠాలు అనే అంశాలపై ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడల అధికారి సత్తార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యుత్ అధికారి టి. ఈషయ్య పాల్గొని విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించారు. భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వికసిత్ బారత్ ద్వార ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. మరోవైపు కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస పోటీలలో ఉస్మానియ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ చెల్లమల్ల వెంకటేవ్వర్లు, ప్రొఫెసర్ ఎం. క్రిష్ణకుమార్, హనుమంతరావు, మహేందర్‌రెడ్డి తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. చంద్రకళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## తండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి..

**దుద్యాల్, మార్చి 13, ప్రభాతవార్త:** తాండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వాల్యా నాయక్ తండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో ఎంజిఎన్ఆర్ఇజిఎ నిధులు రూ.5 లక్షలతో సిసి రోడ్డు పనులు గ్రామ సర్పంచ్ మూడావత్ దేవీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేనవత్ దశరథ్, వార్డు సభ్యులు శాంతి బాయి, బుజ్జి బాయి , సోనబాయి నాయకులు పాండు నాయక్, హర్యా నాయక్, హరిచంద్ , కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు